
సాక్షి
గుంటూరు
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ సోమవారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,16,034 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 88,979 క్యూసెక్కులు వదులుతున్నారు.



దుర్గగుడిలో ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి: చంద్రగ్రహణం అనంతరం దుర్గమ్మ ఆలయాన్ని ఆలయ అర్చకులు శుద్ధి చేశారు. సోమవారం స్నపనాభిషేకం, విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

జిల్లా పౌర సరఫరాల అధికారిగా శ్రీనివాసరావు



గుంటూరు వెస్ట్: జిల్లా పౌరసరఫరాల అధికారిగా కె.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్నారు. డీఎస్‌ఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన ఆర్.చంద్రముని దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన స్టెప్ సీఈఓగా పనిచేస్తూ డీఎస్‌ఓగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిశారు.

అమరేశ్వరునికి గ్రహణానంతర ప్రత్యేక పూజలు



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలో చంద్ర గ్రహణానంతరం సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం వేకువజామున ఆలయశుద్ధి అనంతరం స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా విఘ్నేశ్వర పూజ, నవగ్రహ మంటపారాధన, పుణ్యాహవాచన నిర్వహించారు. అనంతరం పుణ్యాహవాచన జలాలను మేళతాళాలతో అమరేశ్వరునికి అభిషేకించారు. బాలచాముండేశ్వరి అమ్మవారికి, ఉపాలయాల్లో అభిషేకం నిర్వహించారు. ఉదయం 8గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

11న డిప్యూటీ సీఎం పర్యటన

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా పర్యటన ఖరారైనట్లు అధికారులు తెలిపారు. ఈనెల 11వ తేదీ గురువారం ఆయన జిల్లాకు రానున్నారు. బాపట్ల మండలం ముత్తాయపాలెం సమీపంలోని పేర్లి కెనాల్ బ్రిడ్జి వద్ద రిజర్వు ఫారెస్ట్‌లో మడ మొక్కలు నాటనున్నారు. బ్రిడ్జి వద్ద నుంచి 3.7 కిలోమీటర్ల మేర ఇరువైపులా మడ అడవులను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో 35 వేల మొక్కలను నాటనున్నారు.

దయ కలిగిన తల్లి వేళాంగణిమాత



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): దయ కలిగిన తల్లి వేళాంగణిమాత అని రాయవరం విచారణ గురువులు రత్నబాబు అన్నారు. పాలువాయి జంక్షన్‌లోని వేళాంగణిమాత మందిరం 26వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి నేతృత్వంలో సమష్టి పవిత్ర దివ్యపూజాబలిని సమర్పించారు. ఫాదర్ రత్నబాబు మాట్లాడుతూ వేళాంగణిమాతలోని ప్రేమ, దయ, కరుణ, క్షమాపణ, వినయం, విశ్వాసం, శాంతి, సమాధానాలు వంటి సుగుణాలను క్రైస్తవులు అలవర్చుకొని దేవుని కృపకోసం ప్రార్థించాలన్నారు. అనంతరం మందిరం వ్యవస్థాపకులు దుగ్గింపూడి అనిత కస్పారెడ్డి నేతృత్వంలో భక్తులకు మహా అన్నదానం చేశారు.

కొత్తరెడ్డిపాలెంలో విష జ్వరాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో పది రోజుల్లో ఇద్దరు విష జ్వరాలతో మరణించటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రామాలయం సెంటర్ పరిధిలో కొద్ది రోజుల కిందట బడే రాము అనే వ్యక్తి విష జ్వరంతో గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ కిడ్నీ, ఇతర సమస్యలతో మృతి చెందాడు. ఇదే ప్రాంతంలో గత నెలలో మరో వ్యక్తి జ్వరం బారిన పడి మృతి చెందటంతో స్థానికంగా ఆందోళన వ్యక్తం అవుతోంది. వీరిలో ఒకరికి గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మృతి చెందుతున్న వారి లక్షణాలు ఉన్నట్లు ప్రైవేటు వైద్యులు నివేదిక ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కొత్తరెడ్డిపాలెం సమీప ప్రాంతాల్లో జ్వర పీడితులు సంఖ్య అధికంగా ఉండటంతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. మంగళవారం గ్రామంలో రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు.

యూరియా.. నో స్టాక్ !

- క్యూ లైన్లలో రైతుల పడిగాపులు
- జిల్లాకు వచ్చిన ఎరువులు పక్కదారి
- బ్లాక్‌లో జోరుగా విక్రయాలు
- బస్తాకు అదనంగా రూ. 100 వసూలు
- డిమాండ్‌కు సరిపడా సప్లై లేకపోవడంతో గిరాకీ
- పచ్చ నేతల సిఫార్సుతో కొన్నిచోట్ల పంపిణీ

రైతుల సమస్యలపై కూటమి నిర్లక్ష్యం



కొల్లిపరలో ఓ దుకాణం ముందు రైతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలో రైతుల అవసరాలకు తగినంత యూరియా అందుబాటులో ఉందంటూ అధికారులు లెక్కలు వేసి మరీ చెబుతున్నా అవస్థలు తప్పడం లేదు. రైతు సేవా కేంద్రాలు, గిడ్డంగుల వద్ద పడిగాపులు పడుతూనే ఉన్నారు. డిమాండ్‌కు సరిపడా స్టాక్ క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో కర్షకులు అగచాట్లు పడుతున్నారు. స్టాక్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు నో స్టాక్ అంటారోనని సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారు. రైతుల అవసరాలను అడ్డం పెట్టుకుని కొందరు వ్యాపారస్తులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ దోచుకుంటున్నారు.

రాజకీయ పలుకుబడి ఉంటేనే ఎరువులు

ఎరువులకు రాజకీయ గ్రహణం పట్టింది. యూరియాకు సైతం రాజకీయ పలుకుబడి కావాల్సిన దుస్థితి గ్రామాల్లో చోటు చేసుకుంది. ఎరువుల బస్తాలు తమకు అనుకూలమైన వారికే ఇవ్వాలంటూ ఆయా గ్రామాల్లోని ఆర్‌ఎస్‌కే సిబ్బందిపై స్థానిక కూటమి నాయకులు కర్రపెత్తనం చేస్తుండటంతో కర్షకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరి సాగు చేసిన పలువురికి యూరియా కట్టలు సకాలంలో అందని పరిస్థితి కనిపిస్తోంది. ఆర్‌ఎస్‌కే సిబ్బంది కూడా కూటమి నాయకుల ఒత్తిళ్లకు లొంగిపోతున్నారు. ఓ వర్గం రైతులకే యూరియా కట్టలు కట్టబెడుతున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో స్టాక్ వచ్చిన గంటల వ్యవధిలోనే ఆర్‌ఎస్‌కే సిబ్బంది నో స్టాక్ అంటూ నిర్మొహమాటంగా చెప్పేస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక, బయట మార్కెట్లో దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారు.

> **నేడు అన్నదాత పోరు**
>
> అన్నదాతల యూరియా కష్టాలపై వైఎస్సార్ సీపీ మంగళవారం జిల్లాలోని అన్ని ఆర్డీవో కార్యాలయాలవద్ద నిరసన చేపట్టనుంది. కార్యక్రమంలో పార్టీ శ్రేణులతోపాటు పెద్ద ఎత్తున రైతులు పాల్గొననున్నారు. గుంటూరు, తెనాలి ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి.

కాగితాల మీద భారీగా లెక్కలు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు 24,012 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు 22,384.4 మెట్రిక్ టన్నులను సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ చిల్లర, టోకు వర్తకులతో పాటు మార్క్‌ఫెడ్‌ల వద్ద మరో 2,739.85 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు చెబుతున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో 4,100 మెట్రిక్ టన్నులు జిల్లాకు రానుందని, ఈ నెల చివరిలోగా మరో 6,100 మెట్రిక్ టన్నులు వస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు.



పొన్నూరు మార్కెట్ యార్డు వద్ద రైతుల పడిగాపులు

అరకొరగా పంపిణీ

తెనాలి నియోజకవర్గంలో యూరియా కష్టాలు తీరడం లేదు. రైతుకు అవసరం ఉన్నంత మేరకు ఇవ్వలేకపోతున్నారు. తెనాలి మండలానికి సంబంధించి 185 మెట్రిక్ టన్నులు, కొల్లిపర మండలంలో 80 టన్నుల యూరియా ఉంది. రోజుకు 50 మంది రైతులకు స్లిప్పులు ఇచ్చి అరకొరగా పంపిణీ చేస్తున్నారు. అదేమంటే రేపు మరికొంత వస్తుందని చెబుతున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసిన రైతులు అవస్థలు పడుతున్నారు. పొరుగున ఉన్న వేమూరు నియోజకవర్గానికి చెందిన రైతులు కూడా ఇక్కడకు వస్తున్నారు. ప్రైవేటు దుకాణాల్లో యూరియా అమ్మడం లేదు. కంపెనీలు అధిక రేటు వసూలు చేయడం, ప్రతి కట్టకు ఒక నానో కట్ట తీసుకోవాలనే షరతులతో ప్రైవేటు ఎరువుల షాపుల వాళ్లు అసలు తీసుకోవడం లేదు. దీంతో ఆయా షాపుల్లో అమ్మకాలు లేవు. ప్రభుత్వ సొసైటీల పైనే రైతులు ఆధారపడాల్సి వస్తోంది. కొల్లిపర మండలంలోనే ప్రైవేటు దుకాణాల్లో అమ్మకాలు లేవు. తెనాలిలో ప్రైవేట్ ఎరువుల దుకాణాలు కూడా సరిగా సప్లై చేయడం లేదు. దీంతో ఎరువుల కొట్ల బజార్‌లో దుకాణాలు వద్ద రైతులు ఎదురుచూస్తున్నారు

పచ్చ నేతల దారి మళ్లింపు

పొన్నూరు నియోజకవర్గంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీలు, మార్కెట్ యార్డులు, రైతు సేవా కేంద్రాల వద్ద తెల్లవారుజామున 4 గంటల నుంచే పడిగాపులు కాస్తున్నా లభించని పరిస్థితి నెలకొంది. వచ్చిన యూరియాను కొంతమందికే ఇచ్చి మిగతావి పచ్చ నేతలు దారి మళ్లిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. సొసైటీలకు రాత్రి వేళ లారీల్లో వచ్చిన యూరియాను దిగుమతి చేసే సమయంలో కరెంట్ తీసి వంద కట్టలకు పైగా పక్కదారి పట్టించారని రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారుల పనితీరుపై రైతులు మండిపడుతున్నారు.

కూటమి చెప్పిన నేతలకు సరఫరా

ప్రత్తిపాడు మండల పరిధిలోని పాతమల్లాయపాలెం సొసైటీలో 20 టన్నుల యూరియా నిల్వ ఉంది. మిగిలిన రైతు సేవా కేంద్రాల్లో స్టాకు లేదు. ఇండెంట్ పంపించామని, ఇంకా రాలేదని అధికారులు చెబుతున్నారు. ప్రత్తిపాడు మండలంలోని వంగిపురంలో 20 టన్నుల యూరియా సరఫరా చేస్తే అది పంట వేసిన రైతులకు కాకుండా కూటమి చెప్పిన నేతలకు మాత్రమే సరఫరా చేసారన్న ఆరోపణలు ఉన్నాయి. పెదనందిపాడులోని ఏ ఒక్క సొసైటీలోనూ ప్రస్తుతం నిల్వలు లేవు. ఇప్పటివరకు మండలానికి 257 టన్నుల ఎరువులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రైవేటు దుకాణాల్లో అదనంగా వసూలు

తాడికొండ నియోజకవర్గంలో రైతులకు యూరియా దొరకడం లేదు. ప్రైవేటు దుకాణాల్లో బస్తాకు రూ. వంద అదనంగా వసూలు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులే గతంలో వచ్చిన యూరియా బస్తాలను నిల్వ చేసుకుని బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. యూరియా బస్తాతో పాటు నానో యూరియా కొనాల్సిందేనని డిమాండ్ పెడుతున్నారు.

పొన్నూరులో బారులు తీరుతున్న రైతులు

పొన్నూరు మార్కెట్ యార్డులో తెల్లవారుజాము నుంచే వందల సంఖ్యలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. అనేక సొసైటీలు, ఆర్‌ఎస్ కేంద్రాల్లో ఇదే దుస్థితి. సామాన్య రైతులకు పక్కన బెడుతూ, సొసైటీల్లో పరపతి ఉన్న వారికే అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో యూరియా అందిన రైతుల నుంచి అరువు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు విక్రయించడంతో పాటు పురుగు మందులు కూడా తీసుకోవాలని రైతులను ఇబ్బంది పెడుతున్నారు. సాగుకు యూరియా అందించలేని కూటమి ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు.

భర్త వేధింపుల నుంచి రక్షించండి !

- విలేకరి ముసుగులో ఆగడాలు
- ప్రాణ రక్షణ కల్పించాలని మహిళ వేడుకోలు
- జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు



చిన్న కుమార్తె లావణ్యతో బాధితురాలు నాగేశ్వరి

గుంటూరు: వారసత్వంగా రానున్న పొలం కాగితాలు రాయించుకుని తేవాలంటూ భర్త, బావ అయిన ఈనాడు విలేకరి (గుంటూరు జిల్లా ప్రత్తిపాడు)తో పాటు అత్త, మామల నుంచి రక్షణ కల్పించాలని ఓ మహిళ, తన కుమార్తెతో కలసి ప్రాధేయపడింది. గత నాలుగు రోజులుగా కనిపించకుండా బంధువుల ఇళ్లల్లో ఉంటున్నట్లు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా ఫిర్యాదులు- పరిష్కార వేదికలో మొరపెట్టుకుంది. అనంతరం బాధితురాలైన కల్లూరి నాగేశ్వరి మీడియాతో మాట్లాడారు. 2009లో ప్రత్తిపాడుకి చెందిన కల్లూరి గురునాథంతో పెళ్లి అయ్యింది. ఇద్దరు ఆడ పిల్లలు. పెద్దమ్మాయి గుంటూరు బ్రాడీపేటలోని ఓ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, రెండో కుమార్తె ఏడో తరగతి చదువుతోంది. భర్త, నేను పొలం పనులకు వెళ్తాం. భర్తకు మద్యం అలవాటు ఉంది. అయితే మా అమ్మమ్మ చెవినేని ఈశ్వరమ్మ నుంచి తల్లి ఆదిలక్ష్మి వాటా కింద రావాల్సిన 70 సెంట్ల పొలం ప్రత్తిపాడులో ఉంది. ప్రస్తుతం దాని ధర రూ.20 లక్షలు ఉంది. నేను పుట్టిన తరువాత అమ్మ చనిపోయింది. అప్పట్లో నాన్న సంజీవరావు మరొకర్ని పెళ్లి చేసుకున్నాడు. అమ్మమ్మ ఈశ్వరమ్మ వద్దకెళ్లి 70 సెంట్ల పొలం రాయించుకుని కాగితాలు తేవాలంటూ భర్త, బావ అయిన ఈనాడు ప్రత్తిపాడు విలేఖరి సురేష్, అత్త, మామలు బెదిరిస్తున్నారు. అమ్మమ్మ నుంచి కాగితాలు తీసుకురాకపోతే చంపుతామంటూ చితకబాదడం, గదిలో నిర్బంధిస్తున్నారు. ఈనెల ఐదున నన్ను కొట్టి, తెల్ల కాగితాలు, రూ.50 స్టాంప్ కాగితాలపై సంతకాలు పెట్టించాలని ప్రయత్నించగా అందుకు నిరాకరించాను. దీంతో చెంపలపై కొట్టగా, వారి నుంచి తప్పించుకున్నాను. గతంలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా, అతని పలుకుబడితో కేసు నమోదు చేయలేదు. అదిగాక ఎమ్మెల్యే రామాంజనేయులు, రాజకీయ నాయకులు, పోలీసులు తెలుసంటూ బెదిరిస్తున్నారు. ఆఖరికి గుంటూరులో చదువుతున్న కుమార్తెను చూడాలన్నా విలేకరి అయిన బావ అనుమతి తప్పనిసరి అని బాధితురాలు నాగేశ్వరి వాపోయింది. డీపీఓలో కూడా న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణమని ఆందోళన వ్యక్తం చేసింది.

బకాయిల విడుదలకు ఏపీటీఎఫ్ 'నిరసన వారం'



మాట్లాడుతున్న బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ చేపట్టిన 'నిరసన వారం' ఉద్యమ కార్యాచరణ విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న సంఘ జిల్లా శాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు 15నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పటం లేదని, 30శాతం ఐఆర్‌పై కప్పదాటు వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించకపోవడంతో ఉపాధ్యాయుల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. అనవసరమైన యాప్స్ రద్దు చేయక పోగా పనిభారం పెంచే అస్సెస్మెంట్ బుక్లెట్స్ పెట్టడం పుండు మీద కారం చల్లినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని మొర పెట్టుకునేందుకు విద్యాశాఖా మంత్రి అందుబాటులో లేకపోవడం అత్యంత బాధాకరమని తెలిపారు. 15 నెలలు వేచి చూశామని, అన్ని బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులు రోజుకొక ఉద్యమ కార్యాచరణ నిరసన వారం చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం దిగిరాని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, సత్యనారాయణమూర్తి, జి.దాస్, ముని నాయక్, షుకూర్, గురుమూర్తి, కృష్ణారావు, సుబ్బారావు, రాజ్ పాల్గొన్నారు.

మైనార్టీలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సైదాఖాన్



కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయికులు

గుంటూరు వెస్ట్: ఎన్నికల సమయంలో మైనార్టీలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత దాధారుణంగా మోసం చేసిన కూటమి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటుందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పఠాన్ సైదాఖాన్ తెలిపారు. పార్టీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇమామ్‌లు, మౌజన్‌లకు ప్రతి నెలా క్రమం తప్పకుండా రూ. 5000, రూ.10 వేలు చెల్లించారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా మరచిపోయిందని పేర్కొన్నారు. దీంతోపాటు మసీదుల మరమ్మతులకు ఇస్తామన్న రూ.లక్ష కూడా ఇవ్వలేదని తెలిపారు. నెల వారీ వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం తమ కాలనీలకు వచ్చిన టీడీపీ శాసన సభ్యులు కనీసం సమస్యలపై స్పందించకపోవడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందని తెలిపారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులామ్ రసూల్ మాట్లాడుతూ ఇటీవల పండుగ సందర్భంగా మైనార్టీ విద్యార్థులకు బుర్ఖాలు వేసి నృత్యాలు చేయించిన భాష్యం స్కూల్ అధినేత భాష్యం రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూరి ఫాతిమా మాట్లాడుతూ మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కిన తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మొహమ్మద్ నసీర్ అహ్మద్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు మైనార్టీలకు జరుగుతున్న అన్యాయాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డ్ బిల్లు అంశంలోనూ నసీర్ మైనారిటీల మనోభావాలను అస్సలు గుర్తించలేదన్నారు. తూర్పు నియోజకర్గ పరిధిలో ముస్లింలు తోపుడు బండ్లపై జీవనం పొందుతుంటే వారిని కూడా తొలగించేందుకు నసీర్ సహకరించారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చావుదెబ్బ తింటుందని నూరి ఫాతిమా పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ విభాగం అధికార ప్రతినిధి సయ్యద్ అబీబుల్లా, సంయుక్త కార్యదర్శి అప్సర్, జిల్లా కార్యదర్శి రజియా బేగం, నియోజక వర్గాల అధ్యక్షులు లియాఖత్, ఖాసిం, నూరుల్లా, రబ్బాని, మహబూబ్ బాషా, జాని బాషా, కార్పొరేటర్లు అబీద్, ఫర్జానా, మైనారిటీ విభాగాల మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు !

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకూడదని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సీఎంఓ నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. తమ శాఖకు వస్తున్న అర్జీల పరిష్కారంపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. అర్జీల పరిష్కారంపై ప్రజల్లో సంతృప్తి స్థాయి శాతం తగ్గుతుందని, వాటిని పెంచేలా అధికారులు కృషి చేయాలని ఆమె చెప్పారు. కోర్టు కేసులకు సంబంధించి నిర్ణీత సమయంలో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 276 అర్జీలను డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె. శ్రీనివాసరావు , డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, జిల్లా అధికారులు పరిశీలించారు.

బాధితులకు న్యాయం చేయాలి



తురకపాలెంలో మూడు నెలల్లోనే 30 మంది అకాల మరణాలకు పాల్పడ్డారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తుంది.. ముందే జాగ్రత్తపడాలి కదా ! అధికారులు కనీసం తమ శాఖలపై సమీక్షలు కూడా జరపడం లేదు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.25 లక్షలతోపాటు మరణించిన వారి కుటుంబాలకు వితంతు, ప్రత్యేక పెన్షన్లు అందించాలి. గ్రామానికి ప్రస్తుతం అందుతున్న మంచినీటి సౌకర్యం ఏ మాత్రం సరిపోవడం లేదు. దీన్ని పెంచాలి. గ్రామంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వైద్యుల నియామకంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలి. మరణాలపై న్యాయ విచారణ జరపాలి.

– సీపీఎం జిల్లా నాయకులు

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

పట్టణంలోని 1వ డివిజన్‌లోని నారా భువనేశ్వరి కాలనీ (పందుల కాలనీ)లో 30 సంవత్సరాల నుంచి నివాస ఉంటున్నారు. పందులను పెంచుకుని జీవనం పొందడమే వారి ప్రధాన వృత్తి. ఇక్కడ ఇప్పటి వరకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు. మౌలిక సదుపాయాల కల్పన కూడా లేదు.

– పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ, నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు

నష్టపరిహారం ఎప్పుడిస్తారు ?



మాది తెనాలి మండలం చిన్న రావూరు డొంక. ఫిబ్రవరిలో మా కాలనీలోని యానాది కులానికి చెందిన ముగ్గురు పెదకాకాని గోశాలలో పనికి వెళ్లి విద్యుత్ షాక్‌తో మరణించారు. కలెక్టర్‌తోపాటు ఆర్డీఓ బాధిత కుటుంబాలకు ఉద్యోగంతో పాటు ఇళ్లస్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎన్నిసార్లు తిరిగినా స్పందించడం లేదు.

– బాధిత కుటుంబ సభ్యులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 799

కొమ్ములు : 537బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
9,750	10,531	10,150

కాయలు : 242 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,750	10,550	10,450

మొత్తం అమ్మకాలు : 584.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,255
అమ్మకాలు	52,437
నిల్వ	16,613

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,300
నంబరు–5	10,000–13,500
341	11,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,600
నంబరు–5	10,000–13,600
341	11,000–15,500
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,400
బాడిగ 355	10,000 – 15,500
దేవనూరు డీలక్స్	10,000 – 13,800
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,200 – 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,300
బాడిగ 355	10,000 – 15,000
దువనూర్ డీలక్స్	10,500 – 13,500
తాలు	5,500 – 7,500

–కొరిటిపాడు (గుంటూరు)

చట్ట పరిధిలో ఫిర్యాదులకు పరిష్కారం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు– పరిష్కార వేదికను నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి బాధలను ఆలకించి, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారు. పోలీస్ శాఖ ద్వారా పరిష్కరించే ప్రతి ఫిర్యాదును బాధితులు తమ దృష్టికి తేవాలని కోరారు. అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజల నుంచి జిల్లా ఏఎస్పీ జీవీ రమణమూర్తి (పరిపాలన), డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (గుంటూరు తూర్పు), శివాజీరాజు (సీసీఎస్), భానోదయ (దక్షిణ) అర్జీలు స్వీకరించారు.



సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పెళ్లి అయిన తర్వాత ముఖం చాటేశాడు

ఏడాది కిందట ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాడు. కులాలు వేరైనా కుటుంబ సభ్యులకు తెలియకుండా గతేడాది ఫిబ్రవరి 25న కాకినాడలోని ఓ దేవాలయంలో పెళ్లి చేసుకున్నాం. అక్కడే ఓ ఇంట్లో అద్దెకున్నాం. అయితే, భర్త బంధువు ఒకరూ టీడీపీ గ్రామ అధ్యక్షునిగా ఉన్నాడు. ఈ క్రమంలో మేమిద్దరం ఉండే చిరునామా గుర్తించి, పెదకాకాని పీఎస్‌లో హాజరుపరిచారు. మేజర్లు కావడంతో, మళ్లీ కాకినాడ వెళ్లి కాపురం చేసుకుంటున్నాం. భర్తకు, అతని సోదరికి బ్యాంక్‌లో జాయింట్ అకౌంట్ ఉందని, బంగారం విడిపించాలంటూ నంబూరు పిలిచారు. బ్యాంక్ పనులు పూర్తయ్యాక భర్తను బలవంతంగా కారులో ఎక్కించి తీసుకెళ్లారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. కొద్ది రోజుల తర్వాత భర్త, అతని కుటుంబ సభ్యులు అసభ్యంగా, కులం పేరుతో నన్ను దూషించారు. అప్పటికే గర్భవతిగా ఉండగా, ఇష్టానుసారంగా మాట్లాడారు. అయితే, అప్పటి నుంచి భర్త ఆచూకీ తెలియలేదు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనంలేదు. ఇటీవల భర్త పల్నాడు జిల్లా నరసరావుపేట రెడ్డిపాలెం ఉంటున్నాడని తెలిసింది. అయితే, మరో యువతీతో పెళ్లికి సిద్ధమవుతున్నట్లు ఇన్‌స్ట్రాగామ్‌లో ఫొటోలు చూశాను. కులం పేరుతో దూషించి చితకబాదిన వారిపై చర్యలు తీసుకోవాలి. వారి నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని కోరుతున్నా.

– పి.దీపిక, నంబూరు, పెదకాకాని మండలం



బాధితురాలు దీపిక

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

చీరాల అర్బన్: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చీరాల మండలం ఈపూరుపాలెం ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన శ్రీకౌసల్య (23) రెండేళ్లుగా పుట్టింటిలోనే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం ఇంటి వెనుక కాలువలోని చిల్లచెట్లకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఈపూరుపాలెం ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

రేపు నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం

తెనాలి: ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సం ఈనెల 10న ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనుంది. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు ఏర్పాటయే ప్రత్యేక సభకు సంస్థ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఫైనాన్సియల్ సర్వీసెస్ విభాగ కార్యదర్శి నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో చెన్నైలోని సీఎల్ఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ స్వర్ణ వి.కాంత్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం పాల్గొంటారు.

తెనాలి ముద్దుబిడ్డ



తెనాలికి చెందిన విలక్షణ మహనీయుల్లో ప్రఖ్యాత శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ ఒకరు. విదేశాల్లో ఉన్నతవిద్య చదువుకుని, అక్కడే ఉద్యోగావకాశం లభించినా, కాదనుకుని మాతృదేశం వచ్చారు. చెన్నైలోని కేంద్ర చర్మ పరిశోధన సంస్థ (సీఎల్ఆర్ఐ)లో శాస్త్రవేత్తగా చేరారు. తన కృషితో డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. తోలు పరిశ్రమ రంగంలో సాధించిన విజయాలతో 48 జాతీయ పరిశోధనాశాలలు, 30 వేల శాస్త్రవేత్తలు కలిగిన సీఎస్ఐఆర్‌కు డైరెక్టర్ జనరల్‌గా చేశారు. శాస్త్ర విజ్ఞాన అధ్యయనాలు, పరిశోధనలపై ఎంతో నిబద్ధత కలిగిన డాక్టర్ నాయుడమ్మ, దేశమంతా శాస్త్రీయ అభినివేశం లోతుగా విస్తరించాలని తపించారు. హేతుబద్ధ చింతన, శాస్త్రీయ వివేచనా, నిరంతరం అధ్యయనం, నిత్య పరిశోధన ఆయన జీవ ధాతువులు. సామాజిక విషయాల్లోనూ శాస్త్రీయ అభినివేశాన్ని ప్రదర్శించటం నాయుడమ్మ ఆశయం. మూఢ విశ్వాసాల్నీ ముహూర్త బలాల్నీ వీడి, మనిషి చైతన్యం, వ్యక్తిత్వం వికసించే మానవీయ సమత వైపు అడుగిడటం ఆయన కర్పించే నిజమైన నివాళి. అలాగే ఆయన పేరిట అవార్డులకూ శాస్త్రవేత్తలనే ఎంపిక చేస్తే సబబుగా ఉంటుంది.

చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కొత్తపేట భగత్ సింగ్ బొమ్మ వద్ద చెవిలో పూలు పెట్టుకుని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ పది మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నడపడం వల్ల మెరిట్ విద్యార్థులు ఎంబీబీఎస్‌కు దూరమవుతారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 14 మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారని, వాటిలోరాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, విజయనగరం జిల్లాల్లో గత విద్యా సంవత్సరంలో కళాశాలలు ప్రారంభమైనట్లు గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన సొంత మంగళగిరి నియోజకవర్గంలో యువగళం పాదయాత్రలో భాగంగా ప్రతి మెడికల్ కళాశాలను 100శాతం ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పీపీపీ విధానాన్ని తీసుకువచ్చి ఈరోజు కళాశాలలను కార్పొరేట్లకు అప్పజెబుతున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫణీంద్ర మాట్లాడుతూ ఈ విధానం వల్ల పేద మెరిట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య కలగానే మిగిలిపోతుందని తెలిపారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77 రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో మోసాన్ని విద్యార్థుల్లోకి తీసుకువెళ్లి పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు . కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండు శివ, బందారపు యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, నాయకులు అజయ్, దుర్గా ప్రసాద్, సాయి గణేష్, పవన్, వెంకీ పాల్గొన్నారు.

తురకపాలెంలో వైద్య సహాయ కార్యక్రమాలు

- కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
- నేడు ఆరోగ్య పరిస్థితులను సమీక్షించనున్న ఐసీఎంఆర్ బృందం

గుంటూరు రూరల్: తురకపాలెంలో సంక్రమణ వ్యాధుల నియంత్రణ చర్యలను మరింతగా బలోపేతం చేసేలా రాష్ట్ర, జిల్లాస్థాయి వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ఎయిమ్స్, ప్రైవేట్ వైద్య నిపుణులతో విస్తృత స్థాయిలో కృషి చేస్తున్నామని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు సంక్రమణ నియంత్రణ చర్యలను పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ ఆసుపత్రి నుంచి వచ్చిన ఇన్ఫెక్షన్ స్పెషలిస్టులు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు గ్రామంలో ఓపీ కేసులను పరీక్షించి రోగులకు చికిత్స అందించారని తెలిపారు. రక్త నమూనాల పరీక్షల్లో అసాధారణ ఫలితాలు వచ్చిన వారికి సంబంధిత విభాగం వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స అందించడంతో పాటు తదుపరి చికిత్స నిమిత్తం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు పంపనున్నట్లు చెప్పారు. మంగళవారం ఢిల్లీ నుంచి ఐసీఎంఆర్ నిపుణుల బృందం గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య పరిస్థితులను సమీక్షిస్తుందని చెప్పారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనారోగ్య కారణాలు, ఇన్ఫెక్షన్ డీసీజ్‌తో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరిలో ఆగస్టు 21న చేరిన పి. ఎలీషా, 31న చేరిన పి. నరసింహారావుకు మెలియోయిడోసిస్ వ్యాధి నిర్ధారణ అయిందని కలెక్టర్ తెలిపారు. వీరి ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని చెప్పారు. గ్రామంలో 4,000 లీటర్ల సామర్థ్యం గల 20 ట్యాంకర్లు, 12,000 లీటర్ల సామర్థ్యం గల మూడు ట్యాంకర్లు ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం 680 వాటర్ క్యానులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

ఎయిమ్స్‌లో 'ఎస్పికాన్' డిక్లరేషన్ ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్య నిపుణులు

మంగళగిరి: అనారోగ్యం, మరణాల ముప్పును ఎదుర్కొనేందుకు ఎస్పికాన్–2025 డిక్లరేషన్‌ను మంగళగిరి ఎయిమ్స్ విడుదల చేయడం అభినందనీయమని మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, ప్రొఫెసర్ ఆఫ్ ఎక్సలెన్స్ న్యూఢిల్లీ డాక్టర్ అతుల్ గోయెల్ తెలిపారు. సోమవారం ఎయిమ్స్‌లో డిక్లరేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యాంటీ మైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్ కోసం ఎయిమ్స్ మంగళగిరి డిక్లరేషన్ విడుదల చేసిందని వివరించారు. క్లినికల్ మైక్రోబయాలజీ , జనరల్ మెడిసిన్, క్లినికల్ ఫార్మకాలజీ విభాగాల సహకారంతో సొసైటీ ఫర్ యాంటీ మైక్రోబయల్ స్టీవార్డ్ షిప్ ప్రాక్టీషస్ ఇన్ ఇండియా(సెస్పీ) జాతీయ వార్షిక కాన్ఫరెన్స్ ఎస్పికాన్– 2025ని విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. భారతదేశం అంటు వ్యాధుల భారాన్ని ఎదుర్కొంటోందని తెలిపారు. ఉష్ణమండల వాతావరణం, పరిశుభ్రత గురించిన అపోహలు వన్ హెల్త్ విధానానికి సవాళ్లు మరింత తీవ్రమయ్యాయని వివరించారు. మందులు ఓవర్ ది కౌంటర్(ఓటీసీ) లభ్యత కారణంగా సాధారణ బ్యాక్టీరియా వల్ల ఇప్పుడు అనేక ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయని తెలిపారు. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు ఎస్పికాన్–2 ల్యాండ్ మార్క్ ఎయిమ్స్ మంగళగిరి డిక్లరేషన్ విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో ప్రొఫెసర్ డాక్టర్ అహంతేమ్ శాంత సింగ్, సెస్పీ అధ్యక్షురాలు డాక్టర్ సరితా మోహపాత్ర, ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుమిత్ రాయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దేబబ్రత దాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. పాండా, డీన్ డాక్టర్ డి. రామ్మోహన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నటరాజ్ పాల్గొన్నారు.

వృద్ధ మహిళను ఇంటి నుంచి గెంటేశారు



ఇంటి ముందు సుధ

నగరంపాలెం: ఇంట్లోంచి బయటకు పంపించడంతో ఓ వృద్ధురాలు ఆరుబయట చీకట్లోనే ఉండిపోయింది. ఆర్టీసీ కాలనీ వెంకట్రావుపేట రెండో వీధిలోని ఓ ఇంట్లో 62 ఏళ్ల సంగీత సుధ ఉంటోంది. పైన ఆమెకు తెలిసిన కుటుంబ సభ్యులు ఉంటున్నారు. సోమవారం రాత్రి ఆస్తి విషయంపై సుధతో వారు గొడవకు దిగారు. ఇంట్లోంచి బలవంతంగా ఆమెను బయటకు పంపేశారు. లోపలకు రాకుండా గేటుకు లోపల తాళాలు వేశారు. దీంతో చేసేది లేక సుధ ఇంటి ఎదుట ఓ కుర్చీలో కూర్చుండి పోయింది. ఇంటి ఆస్తికి సంబంధించి గొడవ కోర్టులో ఉందని, ఆస్తితో సంబంధం లేని వారు ఇంట్లోంచి వెళ్లిపోవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె వాపోయింది. స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయినట్లు తెలిపింది.